

వనస్థలిపురంలోని ఓ కాలనీలో ఇండ్ల చుట్టూ చేరిన వరద నీరు

# వర్ష బీభత్సం

## స్తంభించిన జన జీవనం

నగరంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు పలు కాలనీలు, ఇంకా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ వర్షాలు పడటంతో పలు కాలనీలు, బస్తీలు, కొన్ని ప్రాంతాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో నివాసాలలోకి నీరు చేరడంతో జన జీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పలు కాలనీలలో విద్యుత్, తాగునీరు లేక జనం ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమైన యంత్రాంగం సేవలందిస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న ముషీరాబాద్ పరిధిలోని అశోక్‌నగర్ నాలా



మాదాపూర్‌లోని సైబర్ టవర్స్ సమీపంలో కురుస్తున్న భారీ వర్షం



బాలానగర్- సఫ్దర్‌నగర్ లోతట్టు ప్రాంత బాధితులకు భోజనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యాలయ సిబ్బంది



నేరేడ్‌మెట్‌లో ఓ ఇంటిపై కూలిన భారీ వృక్షం



బాలానగర్ పరిధిలోని సమతానగర్‌లో కూలిపోయిన చెట్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహా యాదవ్



కీసరలో భారీ వర్షాలకు విరిగి పోయిన విద్యుత్ స్తంభం



అలుగు పోస్తున్న షేక్‌పేట పరిధిలోని మల్కం చెరువు

## మహిళలపై దాడులను ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతా సిన్హా, చిత్రంలో తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1: సమాజంలో మహిళలపై నిత్యం జరుగుతున్న దాడులు, హింసలు, అనాగరిక చర్యలపై ప్రతి ఒక్కరు వ్యతిరేకత తెలుపుతూ గొంతెత్తి ప్రతిఘటించాలని రామన్ మెగసేసే అవార్డు గ్రహీత, ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు సందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొనసాగుతున్నాయి. ఆదివారం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శాంతా సిన్హా హాజరై ప్రసంగించారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు గొంతులు పెంచాలని పిలుపునిచ్చారు. ఒక రకంగా పితృస్వామిక భావజాలం ఈ హింసకు కారణం కాబట్టి దానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రొఫెసర్ రమా మెల్కోటే మాట్లాడుతూ, ప్రగతిశీల మహిళా సంఘం ఏర్పడి 50 ఏండ్లు అయ్యిందని, ఆనాటి నుంచి నేటి సమాజ పరిస్థితుల్లో దారుణమైన మార్పులు వచ్చాయన్నారు. మహిళలు గౌరవంగా జీవించే పరిస్థితులు క్షీణించాయని, ఐతే, మహిళ గొంతులు కూడా పెరిగాయని, కానీ పట్టించుకునే స్థితిలో పాలకులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ ఆవిష్కరించారు. సమావేశంలో ప్రొఫెసర్ మేరీ జాన్, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అండే మంగ, అనుసూయ, డాక్టర సరిత, జ్యోతి, జానకి, గీత, వి.సంధ్య, అంబిక, పూనమ్, లక్ష్మి, కావేరి, పుష్ప పాల్గొన్నారు.




గన్ పార్కులో నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఉద్యోగుల జాక్ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ తదితరులు

# సీపీఎస్, యూపీఎస్ విధానం మాకొద్దు

- వర్షాన్ని లెక్క చేయకుండా టీజీ ఉద్యోగుల జాక్ నిరసన
- పెన్షన్ ఉద్యోగుల హక్కు - నినాదాలతో మార్మోగిన గన్ పార్కు

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 1: సీపీఎస్, యూపీఎస్‌లు బేషరతుగా మా కొద్దు, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాక్ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావులు అన్నారు. ఈ మేరకు ఆదివారం పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని గన్ పార్కులో నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, గెజిటెడ్ అధికారుల సంఘం, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కలిసి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షన్ ఉద్యోగుల హక్కు అని అన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ సీపీఎస్, యూపీఎస్ ఒద్దురా.. ఓపీఎస్ ముద్దురా... అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను మానుకోవాలని అన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జాక్ పిలుపు మేరకు ఉద్యోగులు పాల్గొని పెద్ద పెట్టున నినాదాలు ఇవ్వగా, గన్ పార్క్ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీపాల్ రెడ్డి, స్థిత ప్రజ్ఞ, ఏనుగుల సత్యనారాయణ, ఎంబీ క్రిష్ణ యాదవ్, గండూరి వెంకట్, కస్తూరి వెంకటేశ్వర్లు, ఉమాదేవి, శైలజ, బి.శంకర్, తెలంగాణ నాల్గవ తరగతి అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్ బిన్ హసన్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్, సభ్యులు కేఆర్ రాజ్ కుమార్, ఉమర్ ఖాన్, కురాడి శ్రీనివాస్, ఖాలేద్ అహ్మద్, ముఖీం ఖురేషి, శ్రీధర్, రాజు, క్రిష్ణతో పాటు వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### కేంద్రం తెచ్చిన యూపీఎస్‌ను అంగీకరించేది లేదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్: పెన్షన్ లేకుండా చేస్తున్న సీపీఎస్ అనే మహమ్మారి అంతం ఎంతో దూరంలో లేదని, కొత్తగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యూపీఎస్‌ను కూడా అంగీకరించేది లేదని పీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ అన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి నల్లటి దుస్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, కీసర మండల అధ్యక్షులు చీర యాదగిరి, నాయకులు సుభాష్, మహేశ్, గోపాల్, నర్సింహులు, విఠల్, రవీందర్, శ్రీనివాస్, సుధాకర్, రాఘవ, రామచంద్రయ్య, బిక్షపతి, గోపాల్ కల్పన, జ్యోతి పాల్గొన్నారు.

## బీసీల సమగ్ర కుల గణన చేపట్టాలి: సిద్ధేశ్వర్

- దీక్ష విరమించాలని కోరిన ఆర్.కృష్ణయ్య, కూనంనేని, వీహెచ్



గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను పరామర్శించిన ఆర్.కృష్ణయ్య, సాంబశివరావులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 1: సమగ్ర బీసీ కులగణన చేపట్టాలని, స్థానిక ఎన్నికల్లో 42 శాతం కోటా బీసీలకు కేటాయించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ ఎనిమిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేశ్ యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకట్ గౌడ్, బీసీ ఆజాద్ సంఘ్ అధ్యక్షుడు డి.మహేశ్ గౌడ్, అంబేద్కర్ ఆజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి, బీసీ నాయకుడు రవి యాదవ్, అఖిల పక్ష నాయకులు ఆదివారం పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. అనంతరం, వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం కోటా ఇచ్చాకనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ, బీసీ నాయకుల ఆరోగ్యం క్షీణిస్తున్నదని, తాము ప్రభుత్వంతో మాట్లాడతామని, దీక్ష విరమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు దీక్ష విరమించేది లేదని సిద్దేశ్వర్ పటేల్ అన్నారు.

### క్షీణించిన సంజయ్ ఆరోగ్యం..

మరో నాయకుడు, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేత ఆరోగ్యం క్షీణించింది. శనివారం సాయంత్రం నుంచి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, చేతికి ఇన్‌ఫెక్షన్ సోకడం, షుగర్, క్రియాటిన్ లెవెల్ బాగా తగ్గడంతో గాంధీ దవాఖానలో వైద్యులకు చెప్పినా, సరిగ్గా స్పందించడం లేదని ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు హుటాహుటిన శనివారం రాత్రి సంజయ్‌ను కాచిగూడలోని ప్రతిమా ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని సంజయ్ సోదరుడు అభిలాష్ తెలిపారు.

## బీసీల ఆమరణ దీక్షపై ప్రభుత్వం స్పందించాలి

- తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ డిమాండ్



గాంధీ ఆసుపత్రిలో దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర పటేల్‌ను పరామర్శిస్తున్న శ్యాంసుందర్‌గౌడ్, మారోజు రామాచారి

ఆర్కేపురం, సెప్టెంబర్ 1: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీని నెరవేర్చాలని బీసీ సంఘాల నేతలు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి ప్రాణాలను కాపాడాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీని నెరవేర్చాలని గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర పటేల్‌ను తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఘోర శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దీక్ష చేస్తున్న వారి డిమాండ్లు నెరవేర్చకపోతే తెలంగాణలోని బీసీ ప్రజలంతా ప్రభుత్వంపై తీవ్రమైన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ స్వయంగా ఇచ్చిన హామీలైన కులగణన ప్రక్రియ చేపట్టాలని, స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42 శాతం బీసీలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చని పక్షంలో పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ ఉద్యమం కూడా నిర్మిస్తామని చెప్పారు. ఎనిమిది రోజులుగా బీసీ డిమాండ్లపై నిరహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్ధేశ్వర్లు పటేల్, జక్కని సంజయ్ నేత, చాపర్తి కుమార్ గాడ్గేల ఆరోగ్యం క్షీణిస్తుందని, వారి ఆరోగ్యానికి ఏమైనా ప్రమాదం జరిగితే సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని తెలిపారు. పరామర్శించిన వారిలో బీసీ నాయకులు రాజారాం యాదవ్, చామకూర రాజు, కేవీ గౌడ్, అల్వారు వేణు కుమార్, కొంగర నరహరి పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు

## ఎస్ఏఈ ఇండియా పోటీల్లో ఎంఎల్ ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

దుండిగల్, సెప్టెంబర్ 1: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ ఆర్ఐటీ) కళాశాలకు చెందిన ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు చెన్నైలోని ఎస్ఏఈ (సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్) ఇండియా నిర్వహించిన పోటీలలో తమ ప్రతిభను చాటుకున్నారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆగస్టు 29వ తేదీ నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరిగిన ఎస్ఏఈ ఇండియా పోటీలలో పాల్గొని మూడు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీలలో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల తరపున ఏరోనాటికల్ విభాగానికి చెందిన విద్యార్థులు 'టీం ఐరావత్, టీం ఏలస్, టీం వాయుపుత్ర, టీం డార్క్ సైడర్స్'గా మొత్తం నాలుగు టీములుగా ఏర్పడి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో టీం ఏలస్ కెప్టెన్ హర్షిత యాదవ్ ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ మైక్రో క్లాస్ అవార్డులో మొదటి బహుమతితో పాటు పదివేల రూపాయల నగదు బహుమతి గెలుచుకున్నారు. అలాగే, టీం ఐరావత్ కెప్టెన్ ఇషాన్ సూరి ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డు (2వ బహుమతి), బెస్ట్ ప్రజెంటేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో 3వ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఏఈ ఇండియా నిర్వహించిన పోటీలల్లో తమ ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన ఏరోనాటికల్ విభాగం విద్యార్థులు పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడు అవార్డులను గెలుచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ బహుమతులు సాధించడానికి ఎంతో శ్రమించిన ఏరోనాటికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు ఏ.సాయి కుమార్, ఎస్.శ్రీకాంత్ అలాగే, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశాం: మేయర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, సీసీపీ శ్రీనివాస్‌తో ఆదివారం మేయర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు సర్‌ప్లస్ అవుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కాంపౌండ్ వాల్‌ను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కన్‌స్ట్రక్షన్ సైట్లతో తాత్కాలికంగా పనులు ఆపాలని, లేబర్‌ను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద అవాంఛనీయ ఘటలనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలు, స్మార్ట్ వాటర్ డ్రైన్ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలను తరలించాలని మేయర్ అధికారులకు చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఆపద సమయంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూం. ఫోన్ నం. 040-2111 1111కు గానీ, మై జీహెచ్ఎంసీ యాప్‌కు ఆన్‌లైన్ ద్వారా డీఆర్ఎఫ్ (హైడ్రా) ఫోన్ నం. 90001 13667లో గాని సంప్రదించాలని మేయర్ కోరారు. గ్రేటర్‌లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ గేట్ల వద్ద జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి తనిఖీలు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, లేక్స్ ఈఈ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేసి రైతు రాయల స్వర్ణ చరితం నృత్య రూపకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం, ఏబీకే ప్రసాద్

## ఆకట్టుకున్న రైతు రాయల స్వర్ణ చరితం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 1: భారత రంగ స్థలి అకాడమీ ఆఫ్ ఫైన్స్ ఆర్ట్స్, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు రాయల స్వర్ణ చరితం శ్రీకృష్ణదేవరాయల చారిత్రాత్మక నృత్యరూపక ప్రదర్శన ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా శాఖ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం, సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, పురావస్తు శాఖ సీఈఓ డాక్టర్ ఈమణి శివనాగిరెడ్డి, కృష్ణదేవరాయ తదితరులు విచ్చేసి రైతు రాయల స్వర్ణ చరిత్రం శాస్త్రీయ నృత్య ప్రదర్వను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయుల పాలనలో కవులు, కళాకారులను పోషించడం వల్ల ఆయన యుగానికి స్వర్ణయుగంగా పేరు వచ్చిందన్నారు. భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు ఎంఎస్ కోకా విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేసిన రైతు రాయల స్వర్ణ చరితం నృత్య రూపకం వీక్షకులను ఆకట్టుకున్నది. కార్యక్రమంలో భాగవతుల సేతురామ్, గోవింద నాగరత్నం నాయుడు, మునిరత్నమ్మ పాల్గొన్నారు.